# కామాక్షి కసువు (సిట్రోనెల్లా)

ఇది బహు వార్షిక సుగంధతైల గడ్డిమొక్క. షుమారు 2 1/2 నుండి 3 1/2 అడుగుల ఎత్తువరకు పెరుగుతుంది. దీని తైలం సబ్బులు, అగర్‌బత్తి, డియోడరెంట్లు, దోమల మందుల తయారీలో ఉపయోగిస్తారు.

**నేలలు :** ఈ పంట సాగుకు తేలికపాటి ఎర్ర నేలలు మరియు చల్కా భూములు శ్రేష్ఠమైనవి. అధిక సేంద్రియ పదార్థములు కలిగిన ఇసుక, గరప నేలలు సాగుకు అనుకూలం.

**సాగుకు అనువైన ప్రాంతాలు :** వర్షపాతం సంవత్సరం పొడవునా సమానంగా కురిసే ఎత్తైన ప్రాంతాల్లో వర్షాధారంగా సాగు చేయవచ్చు. నీటి పారుదల కింద ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో సాగుచేయవచ్చు.

**నాటే సమయం, నాటే దూరం, మొక్కల సంఖ్య :** ఆరోగ్యమైన దుబ్బు నుండి తీసిన పిలక మొక్కల ద్వారా ఈ గడ్డిని సాగుచేయవచ్చు. పిలకలను సంవత్సరం పొడవునా నాటు వేయవచ్చు అయితే శీతాకాలం మాత్రం అంత అనుకూలం కాదు. ఎందుకంటే చలి వల్ల మొక్క పెరుగుదల బాగా తక్కువగా ఉంటుంది. తొలకరి వర్షాకాలం పిలకలు నాటటానికి చాల శ్రేష్ఠమైన సమయం. సాధారణంగా జూలై-ఆగష్టు మాసాలు ఈ పంట నాటటానికి అనుకూలమైనవి. వరుసల మధ్య 60 సెం.మీ., పిలకల మధ్య 45 సెం.మీ. ఉండేటట్లు మళ్ళలోగాని, బోదెలపై గాని నాటి, మట్టిని గట్టిగా నొక్కి, వెంటనే నీరు పెట్టాలి. ఒక ఎకరాలో నాటటానికి షుమారు 15,000 పిలకలు అవసరం.

**రకాలు :** జావా - 2, బయో-13, మంజూష మరియు మందాకిని.

**ఎరువులు :** ఎకరాకు ఆఖరి దుక్కిలో 4 టన్నుల పశువుల ఎరువు, 40 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. ప్రతి కోత తరువాత ఎకరాకు 40 కిలోల యూరియా రెండు దఫాలుగా (కోసిన వెంటనే మరియు 30-45 రోజుల తర్వాత) వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** నీటి పారుదల కింద ఈ పంటను సాగు చేసినప్పుడు పిలకలు నాటిన వెంటనే నీరు పెట్టాలి. వర్షాలు సరిగా కురియనప్పుడు మొదటి 45 రోజుల వరకు అనగా పిలకలు నాటుకునేటంత వరకు ప్రతి 3 రోజుల కొకసారి నీటి తడులివ్వాలి. పిలకలు నాటుకున్న తర్వాత నేల స్వభావాన్ని మరియు వాతావరణాన్ని బట్టి నీటి తడులివ్వాలి.

**అంతరకృషి మరియు అంతరపంటలు :** నిమ్మగడ్డిలో పేర్కొన్న విధంగానే ఆచరించాలి.

**సస్యరక్షణ :** కామాక్షి కసువు పంటను స్టైమాటోఫోరా ఫ్యూసిబేసిల్లస్ అనే పురుగు ఆశించి నష్టాన్ని కలుగ చేస్తుంది. ఈ పురుగు ఆశించిన మొక్కల లోపలి ఆకులపైన ముడతలు ఏర్పడతాయి మరియు ఆకులు పూర్తిగా తెరచుకోవు. ఈ పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి నాటిన ఒక నెల తర్వాత పంటపై పిచికారి చేయాలి. తదుపరి, పంట కోసిన ప్రతిసారి ఈ క్రిమిసంహారక మందును పిచికారి చేసుకోవాలి లేదా ఎకరాకు 3 కిలోల ఫోరేట్ గుళికలను వేసుకోవాలి. చనిపోయిన దుబ్బులను తీసివేసి నాశనం చేయాలి.

**పంటకోత :** మొదటికోత, పిలకలు నాటిన 5-6 మాసాల తర్వాత వస్తుంది. తదుపరి పంటకోతలను 2-3 మాసాల కొకసారి తీసుకోవచ్చు. పంటను నేల నుండి 20-25 సెం.మీ. వదిలి కోత కోయాలి. దాదాపు 4-5 సంవత్సరాల వరకు కోతలను లాభదాయకంగా తీసుకోవచ్చు. ప్రతి కోత తర్వాత చనిపోయిన మరియు ఎండిన ఆకులను, పిలకలను తీసివేయాలి. దీనివల్ల కొత్తగా వచ్చే పిలకలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి.

**నూనె తీసే పద్ధతి :** డిస్టిలేషన్ పద్ధతి ద్వారా కోసిన తాజా ఆకులను యంత్రంలో వేసి నూనెను కండెన్సర్ పద్ధతి ద్వారా వేరుపర్చాలి. తర్వాత శుభ్రపర్చి గాజు లేక అల్యూమినియం డబ్బాల్లో భద్రపర్చాలి. ఒక టన్ను గడ్డి నుండి దాదాపు 8-10 కిలోల తైలం లభిస్తుంది.

**ఆదాయం :** కామాక్షి కసువు పంటనుండి ఎకరాకు షుమారు 100 కిలోల నూనె మరియు రూ. 14,000-16,000 వరకు నికరాదాయం లభిస్తుంది.